# బండపాటు

జనం మూగేశారు. గొడవ పెద్దదయేటట్టుంది. కొండల చుట్టూ రాళ్లు కొడుతున్న చప్పుళ్లు ఆగిపోయాయి. ఎక్కడపని అక్కడ ఆపేసి అంతా గుమిగూడి పోతున్నారు.

శవాన్ని గుడిసెకు చేర్చడమైంది. తరవాత తతంగమంతా తొందర తొందరగా అయిపోతున్నాది.

"నానే సెర్లోపడ్డం దేముడో!" అని పార్వతి ఒకటే ఏడుస్తున్నాది. చచ్చినవాడి పెళ్లాం పార్వతి. సర్వసన్నద్ధం అయిపోయింది. అప్పుడు దిగిపడ్డాడు నాగన్న. అంత వరకూ కనబడని వాడు అప్పుడు ఊడి పడ్డాడు.

"పని చేస్తూ సచ్చాడు! పని సేయించినోణ్ణి నిలదీసి అడగొద్దా!" అని ప్రశ్నించాడు నాగన్న. కాస్త నోరున్నవాడు నాగన్న.

"రెడ్డొచ్చాడురా మొదలెట్టండి మళ్లా" అన్నాడు గుంపులోంచి వొకడు.

"సచ్చినోడు నెగుస్తాడా? బేగి కానీయండి" అన్నాడు మేస్త్రి సత్యం. సైకిలు మీద జారబడి నిలబడి పనంతా చకచకా చేయించేస్తున్నాడు. మేస్త్రి మేసినట్టే ఉంది.

"నా మాట యినిపించుకున్నావా?" అని రొకాయించి అడిగాడు కాస్తనోరున్న నాగన్న.

"రామిగాణ్ణి కంట్రాక్టరు నంపినాడురా! బండ దొర్లుకొచ్చింది. ఆడి బుర్ర బద్దలైంది. సావు ఆనాగుంది. సచ్చాడు" అన్నాడు మేస్త్రి సత్యం.

ముందు రోజు సాయంత్రం కొండ మీద చాలా చోట్ల బ్లాస్టు చేశారు. బద్దలైన బండలన్నీ కిందికి జార్చేశారు. మర్నాడు పొద్దున్న కొండొద్దున అంతా రాళ్లు కొట్టుకుంటున్నారు. కొండ మీంచి చిన్న బండరాయి పట్టుతప్పి జారిపడ్డాది. ఇసక్కొడిరాయి. గురిపెట్టి రామిగాడి నెత్తిమీద పడ్డాది. బండా ముక్కముక్కలైపోయింది. రామిగాడి బుర్రా ముక్కముక్కలైపోయింది. వారని చచ్చి కూలిపోయాడు. వాడి పుణికెలోంచి కొబ్బరి పువ్వులాగ మెదడు బైటకొచ్చేసింది. మోచెయ్యి తెగిపోయి రెండు గజాల అవతల ఎగిరి పడ్డాది. తెల్లగా రెండెముకలు బైటకొచ్చి వాటి చివర ఐదు వేళ్లతో చెయ్యి చెయ్యిలాగే ఉంది.

"నానేసెల్లో పడ్డందేముడో!" అని ఏడుస్తున్నాది పార్వతి. దాని వెనక ఏడవడాని కెవరూ లేరు. ఏకాకిగా కాకిలా గోలపెడుతున్నాది.

"దానేడుపు యింటున్నావా? దాని గతేంగాను?" అనడిగాడు కాస్త నోరున్న నాగన్న.

"ఒరే నీకు నోరుందిరా! బుర్ర మాత్రం నేదు!" అన్నాడు మేస్త్రీ.

"కంట్రాక్టరుని ఇంకెప్పుడడుగుతారు?"

"అవన్నీ అయినాయిరా. నెగు నెగు. పొద్దునేచిపోతోంది" అన్నాడు మేస్త్రి సత్యం.

"కంట్రాక్టరు డోలు చింపుతానన్నాడు సత్తెం" అన్నాడు వెంట వున్న వో పనివాడు.

"హొదుల్తామురా? ఎర్రప్పా!" అన్నాడు మేస్త్రీ.

"పాకలో ఉంది బేగెళ్లు." అన్నాడు మరో పనివాడు. పాకనగానే పరిగెట్టేడు నాగన్న. మాటలకైతే కాస్త నోరుంది కాని నాగన్నకి సారాకయితే పెద్దపులంత నోరుంది. పాకనిండా జనమే. ఎవడి పట్టుకొద్దీ వాడు పట్టేస్తున్నాడు.

గుడిసెల మధ్యా రోడ్డు మీద జనం యీనేశారు. రోడ్డుమీద టీ కొట్లలో పాలైపోయి టీ ఎవరిదగ్గరా లేదనేశారు.

మేస్త్రీ నిముషాల మీద ఏర్పాట్లు చేశాడు. అన్నీ సిద్ధంగా వున్నాయి. మరిచిపోయిం దొకటిలేదు. పాడిమీదికి శవాన్ని ఈడ్చేశారు. డప్పులు బజాయించడం మొదలెట్టేరు. డోళ్లు ధణుతు లెగరగొడుతున్నాయి. నలుగురూ నాలుక్కొమ్ములూ కాసేశారు. శవం ముందు ఏభైమంది తాళాలు మోగిస్తూ భజన అందుకున్నారు. శవం రోడ్డెక్కింది. నడక జోరెక్కింది.

"నా నేసెల్లో పడ్డం దేముడో!" పార్వతి యేడుస్తూ వెంటబడ్డాది. నలుగురాడ వాళ్లు పట్టుకుని గుడిసెలోకి లాక్కుపోయారు.

"ఎంత ఘోరమైపోయింది!" అన్నాడొకడు.

"కొత్తేటిరా!" అన్నాడు ఇంకొకడు. కొత్తేంకాదు. సామాన్యంగా కొండలంతటా ఉంటున్నవే ఈ చావులు. ఒక్క ఈ కొండే సంవత్సరానికి ఐదారుగుర్ని బలి పుచ్చుకుంటున్నాది. బండలపాటు బండగా చేస్తారు. బండపాటుకి చచ్చేవాడు చస్తాడు. ఆ పూట రామిగాడొక్కడే ఉన్నాడా? వాడిపక్క పాతిక ముప్పైమంది పని వాళ్లు అడామొగా ఉన్నారు. వాడి బుర్ర మీదే ఎందుకు పడాలి? చావుంది. చచ్చాడు. పడవలసి ఉంది. పడ్డాది. జాగ్రత్తలు తీసుకోడానికి ప్రభుత్వం కొండలమీది కొస్తుందా?

"భద్రంగా ఉండు పార్వతీ. ఏడవకు తల్లీ" అంటూ మేస్త్రీ సత్యం జాగ్రత్త చెప్పేడు.

"తెలుసు సత్తెం, నూస్తాములే" అన్నాది కని పెడుతున్న కనకమ్మ. తాపీగా సత్యం చుట్ట ముట్టించాడు. వాడి గుండెల మీద బరువు కాస్త తగ్గింది. శవం వంద గజాలు వెళ్లిపోయింది. వెంట వెళ్లారు వెయ్యి మంది.

"డబ్బే కనకమ్మా! డబ్బుపోతే డబ్బు రాదు" అన్నాడు సత్యం. రామిగాడు చచ్చేడనగానే పది మందిని వెంట పెట్టుకుని సైకిళ్ల మీద కంట్రాక్టరు దగ్గరికి పరిగెట్టేడు సత్యం. కంట్రాక్టరుని మామ్మూలుగా బెదిరించలేదు. రామిగాడు చావుకి కంట్రాక్టరే కారణం. బ్లాస్టు చేసే పద్ధతి ఏమీ సవ్యంగా లేదు. కంట్రాక్టరు ఏ జాగ్రత్తా తీసుకోవడం లేదు. కంట్రాక్టరు కంగారు పడలేదు. సత్యాన్ని పట్టుకున్నాడు. సాఫీగా పనిచేయించమన్నాడు.

సత్యం తిరిగొచ్చి పార్వతికి మూడు వందల రూపాయలు మూడంటే మూడు నోట్లు తెచ్చి, గుడిసెలోకి తీసుకెల్లి ఇచ్చేశాడు. పది మందిలో ఆడవలసిన మాట పది మందిలో ఆడాలి. పార్వతి కొంగుకి గట్టిగా ముడి వేయించి, బొడ్డులోకి దోపించాడు. సత్యానికి కంట్రాక్టరు ఎంత ఇచ్చాడో ఎవరికీ తెలియదు. దహనానికెంతో, తాగుడు కెంతో వివరాలు తెలియవు. మేసే ఉంటాడు మేస్త్రీ. మేసినా పార్వతికి ఘనంగానే ముట్టచెప్పించాడు. వెనక వుప్పరరాముడు చచ్చినప్పుడు ఈ కంట్రాక్టరే ఏభై రూపాయలు పెళ్లాం చేతిలో పెట్టి మెల్లగా జారిపోయాడు. అటువంటిది సత్యం మూడు వందలు ఇప్పించాడు. అందుకే పార్వతిని భద్రంగా ఉండ మన్నాడు.

"ఎదవడబ్బు! డబ్బు పోతే డబ్బొస్తాది. మనిషి పోతే మనిషి వస్తాడా?" అన్నాది కనకమ్మ.

"డబ్బుపోతే డబ్బురాదు. పడ్డపాటంతా పొట్టకిసాలదు. కొండంతా పిండి సేసినా మూడొందలు కళ్లనూడవు. మొగుడుపోతే మరో మొగుడువొస్తాడు!" అన్నాడు మేస్త్రీ సత్యం.

"నీ జిమ్మడ! ఎంత మాటన్నావు!" అన్నాది కనకమ్మ.

"నే నన్నది నిజం! డబ్బుపోతే డబ్బురాదు. వొయిసులో ఉంది. మరో మొగుడొస్తాడు."

"నిజింవే! కాని నువ్విప్పుడందం బాగానేదు."

"నువ్వూ నేను అనుకోవడానికేం?"

"పార్వతితోటీ అంటావు. ఇప్పుడు మన గుండెకాయలు, నీదే కాదులే, అందరివీ అనాగ పని సేస్తున్నాయి."

"నాలుగు పొద్దులు పోతే నువ్వే అంటావు. కుర్రాడు బుద్ధిమంతుడు బుద్ధిగా పెళ్ళాడు పార్వతీ అని".

"నిజింవే! నోకమలాగుంది. మనమెవ్వరమూ సెప్పనక్కర్లేదు. అదే కట్టుకుంటుంది. సచ్చినాడుకాక దానికి మరో మొగుడు ఉండనే ఉన్నాడు!" అన్నాది కని పెడుతున్న కనకమ్మ.

"నన్నన్నావు! నువ్వెంత మాటన్నావో?"

"ఉన్న మాటనేశాను!"

"దాన్ననకు. నీ మాటోటి సెప్పు? నువ్వేటి సేసినావు?"

"సెయ్యవలిసిందే సేసినాను. అందర్నీ సెయ్యమనే సెపతాను" అన్నాది ధైర్యంగా కనకమ్మ. ఇద్దరు పిల్లల తల్లి అయినాక కనకమ్మ మొగుడు చచ్చిపోయాడు. పిల్లల్ని తల్లి కప్పచెప్పి మారుమనువొచ్చింది.

శవం వెళ్ళిపోగానే జనం చప్పబడి పోయారు. సత్యం సైకిలెక్కి వెంట వెళ్లాడు.

అప్పుడు పాకలోంచి బైటపడ్డాడో ముసిలాడు. పీకమొయ్యా తాగేశాడు.

"సత్తెం ఈ సావుకి మాబాగా సేసినాడు!" అని చేటంత మొహంతో మెచ్చుకున్నాడు.

"నోరు మూసుకో ముసిలాడా! సచ్చినాడు కుర్రాడని యేడుపుకాదు! పీకమొయ్యా పోశారని సంబరం!" అన్నాదో యిల్లాలు.

"నానే సెర్లోపడ్డం బాబో!" అంటూ గుడిసెలో పార్వతి యేడుస్తున్నాది. గుడిసెనిండా గుడిసెచుట్టూ గుమిగూడారు ఆడవాళ్లు.

మధ్యాహ్నం పన్నెండుకి అంతా చల్లబడిపోయింది. కట్టెని కట్టెలకి అప్పచెప్పి వొళ్లు కడిగేసుకొన్నారు.

రోజంతా తందనాలాడుతూ పనులు మానుకొన్నారు.

వారం తిరక్కుండా దిగపడ్డాది చచ్చినవాడి తల్లి చామాలు. చామాలు కొడుకుని చూసి ఐదారేళ్లయి పోయింది. ఒక్కనాడు కొడుకునీ కోడల్నీ చామాలు సుఖంగా బతకనిచ్చింది కాదు. దాని పోరు పడలేక రామిగాడు పార్వతిని వెంటబెట్టుకుని కొండల మధ్య రాళ్లు కొట్టుకుంటూ బతికాడు. గుడిసెలు చేరగానే గుండె బాదుకుంటూ చామాలు ఏడుపు మొదలెట్టింది.

"వొచ్చినావాఁ చామాలూ! ఇక్కడ నీ ఏడుపు ఇనే వాళ్లెవరు?" అన్నాది కనిపెడుతున్న కనకమ్మ.

"కోడలునేదా తల్లే?" అని రాగంతో ఏడుస్తున్నాది.

"పనినోకి పోయింది."

"శబాసు! పనినోకి పోయిందా? ఎంత ఘోరం!" అన్నాది చామాలు.

"దాని కష్టానికున్నారా? సుఖానికున్నారా? ఒక్కత్తి గుడిసెలో ఉంటే పిచ్చెత్తిపోదా? మావేఁ పనిలోకి ఈడ్చుకెళ్లాము. నాల్గు రాళ్లు వస్తాయి" అన్నాది కనకమ్మ.

"మీరంతా గదుసోళ్లమ్మ! మాము సత్తెకాలపోళ్లం" అన్నాది చామాలు. పనిలోంచి తిరిగొచ్చిన పార్వతికి అత్త మొహం కనబడ్డాది.

"నానేసెర్లో పడ్డం అత్తో!" అంటూ ఏడుపు మొదలెట్టింది. వరసలు వరసలు పెట్టి ఏడవడం చాతకాలేదు. ఎప్పుడూ ఒకే ఏడుపు ఏడుస్తున్నాది.

"నానే బందలోపడ్డం కోడలో!" అంటూ అత్త లంకించుకొంది. పుట్టిన దగ్గరనుంచి రామిగాడు పెద్దవాడయ్యే వరకూ వాడి కబుర్లెన్నో ఏడుపుతో మిలాయించి చెప్పింది.

"అమ్మా మేస్త్రీ సంత్తెంనేదా?" అని ఆఖరికి అడిగింది.

"ఆ కంట్రాక్టరుని అడిగినారా?" అని అడిగింది. అన్నీ తెలుసుకొనే వచ్చింది. అక్షరాలా మూడు వందలు కోడలికి ముట్టాయని స్పష్టంగా తెలుసుకొన్నాకే బయల్దేరి వచ్చింది.

"అళ్లనడగడాని కొచ్చినావా?" అన్నాది కనిపెడుతున్న కనకమ్మ.

"కొడుకు పోనాడు. పోనాడనే అడగడాని కొచ్చినాను" అని ఏడ్చింది చామాలు.

"కొడుకుండగా వోపాలీ వొచ్చినావు కావేమి?" అడిగింది కనకమ్మ.

"అడుగుతారమ్మా! అడుగునున్నవి కనబడవు. కడుపు కాలి ఏడుస్తున్నాను తల్లీ. మేస్త్రీ సత్తెం నేడా? మేస్త్రీ సత్తెం నూడ్డా?" అని యేడ్చింది చామాలు.

మేస్త్రీ సత్యం వచ్చాడు.

"నీ కోసమే నూస్తున్నాను సత్తెం. అందరికీ మొనగాడివి వున్నావనే వొచ్చినాను సత్తెం" అని యేడ్చింది చామాలు

"యేటే చామాలు గోల?" అన్నాడు సైకిలు దిగి సత్యం.

"డబ్బు! నువ్వు సెప్పినావుకదా డబ్బు! డబ్బుకొచ్చింది చావాఁలు" అన్నాది కనిపెడుతున్న కనకమ్మ.

"నేనే సెర్లోపడ్డం తల్లో" అని యేడుస్తున్నాది పార్వతి.

"నా నెంత గోల పెట్టినా ఎవ్వరూ ఒక్కమాటనరు! నువ్వు నాయం సెపతావని వొచ్చినాను" అన్నాది చామాలు.

"నాను నీకేటి సెయ్యగలను చామాలు?" అని ప్రశ్నించాడు సత్యం.

"కంట్రాక్టరిచ్చింది. అందులోనే తల్లికింత అనొద్దా?" అని ప్రశ్నించింది చామాలు.

"అందుకా వొచ్చినావు చామాలు? కోడల్ని తీసికెళతావనుకొన్నాను! నాయం సెప్పమన్నావా? కొడుకు సచ్చిపోయినాడా? వాడి పెళ్లాం పార్వతికి మీరుండే యింట్లో వాటా వొస్తుంది. మీ కొంపలో కుండా మలకా ఏటుంటే ఆట్లో నీ కోడలికి వాటా వొస్తుంది. తెలిసిందా? ఇక్కడ నీ కొచ్చేది నెత్తిన సేతులే!" అన్నాడు మేస్త్రీ సత్యం.

సత్యం కొంత సత్యమే పలుకుతూ ఉంటాడు.

"నాయమెక్కడుంది? కట్టుకున్న దానికి సెప్పినారు. కనుకున్న దానికి సెప్పినారుకారు. మా కొంపకూడా కోడలి కివ్వాలట! నాయమెక్కడుంది" అంటూ నిజంగా నెత్తిమీద చేతులు పెట్టుకొని ఎవ్వరి మొహం చూడకుండా రోడ్డుకి వెళ్లిపోయింది.

"కనకమ్మా నూసినావా? తల్లిని! డబ్బే డబ్బు!" అన్నాడు మేస్త్రీ సత్యం.

"చామాల్ని ఎంట పెట్టేసినావుగాని నాదో సిన్నమాటుంది" అన్నాది కనకమ్మ.

"సెప్పు".

"ఇనాగా? మెల్లిగా సెప్పాలి" అని మెల్లిగా రహస్యంగా అడిగింది కనకమ్మ.

"నాకో కోక కొనవా?" అని.

"నీ కెందుకో కోక?"

"రెండొందలు నీకు ముట్టినాయికదా! నాకు కోక్కాను" అన్నాది కనిపెడుతున్న కనకమ్మ.

"నాను పడ్డ పాటో? అందరినోళ్లు నాక్కి పని గప్‌చిప్‌గా సేయించాను" అన్నాడు సత్యం.

"అందరి ఆడాళ్లనోర్లూ నొక్కి వెనక సాయం నీకు నానూ సేశాను."

"సేసినావు నిజివే, కొనుక్కో కోక, ఇస్తాను" అన్నాడు సత్యం.

"సూడు ఎంత ఘోరమో?"

"ఘోరమే! రామిగాడు చస్తే నాకు రెండొందలూ నీకో కోక వొచ్చినాయి."

"అది కాదురా ఘోరం. పార్వతికి మరో మొగుడున్నాడని సెప్పినాను కానా? ఆడు మొన్న రాత్రే దాని గుడిసెకు సేరుకున్నాడు!"

"నిజంగా?"

"నిజం."

"ఘోరమే! కాని నాను సెప్పినట్టే ఐంది."

"నువ్వు సెప్పినట్టే ఐంది. అంతేనా? ఆడు పాలెంలో గేదెని బేరమాడుతున్నాడు" అన్నాది కనిపెడుతున్న కనకమ్మ.

❈

జ్యోతి దీపావళి సంచిక – 1968